# నల్లగొండలో వాసవీ జయంతి వేడుకలు



**ఘనంగా అమ్మవారి జన్మదినోత్సవం..**
**ప్రభుత్వానికి ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు**
**చండూరు, ఏప్రిల్ 26 (వుదయం):**

నల్లగొండ జిల్లా కేంద్రంలో వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి. జిల్లా ఆర్యవైశ్య మహాసభ, మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు విశేష స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం వాసవీ జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఈ ఏడాది ఉత్సవాలు మరింత ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం నుంచే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్, చండూరు మున్సిపల్ 1వ వార్డు కౌన్సిలర్ **తేలుకుంట్ల రాజకుమారి* దంపతుల సమక్షంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. మహిళా విభాగం సభ్యులు అమ్మవారికి మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ వేడుకల్లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి *కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు మున్సిపల్ మేయర్ *బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల చిరకాల కోరికను మన్నించి, వాసవీ జయంతిని ప్రభుత్వోత్సవంగా ప్రకటించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.వాసవీ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆర్యవైశ్య సంఘం నేతలు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

కులమతాలకు అతీతంగా అహింసా మార్గాన్ని బోధించిన వాసవీ మాత ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## పరిశుభ్రత కార్మికులకు ఘన సన్మానం
# సేవకు సమాజం నుంచి గౌరవ వందనం

**భద్రాచలం 26-04-2026 |**
**వుదయం ప్రతినిధి**



పవిత్రమైన భద్రాద్రి క్షేత్రంలో నిత్యం వేలాది మంది భక్తులు సందర్శించే శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సేవలందిస్తున్న పరిశుభ్రత కార్మికులకు ఈ రోజు ఘన సన్మానం నిర్వహించడం జరిగింది. దేవస్థాన పరిసరాలను శుభ్రంగా, పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ సేవకుల కృషిని గుర్తించి వారిని గౌరవించడం ప్రత్యేకంగా నిలిచింది. భ క్తు లు ఎ లాం టి ఇ బ్బం దు లు లేకుండా దర్శనం చేసుకునేలా, ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేస్తున్న ఈ కార్మికులు నిజమైన సేవకులని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు కొనియాడారు. వర్షం, ఎండ, చలి అనే తేడా లేకుండా తమ విధిని నిర్వర్తిస్తూ, భక్తులకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం వారి గొప్పతనమని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు శాలువాలు కప్పి, సత్కార పత్రాలు అందజేసి గౌరవించారు. కొందరు కార్మికులు తమ అనుభవాలను పంచుకుంటూ, ఈ గుర్తింపు తమకు మరింత ఉత్సాహాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఇలాంటి గౌరవాలు తమ సేవను మరింత నిబద్ధతతో కొనసాగించేందుకు ప్రేరణగా ఉంటాయని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ – పరిశుభ్రత కేవలం కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. భక్తులందరూ కూడా తమవంతు బాధ్యతగా పరిశుభ్రతను పాటించాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలనిసూచించారు.అదేవిధంగా, సమాజంలో కనిపించని వీరులైన పరిశుభ్రత కార్మికులకు గౌరవం ఇవ్వడం ద్వారా మన సంస్కృతిని కాపాడుతున్నామనే భావన కలగాలని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సేవా భావం, కృతజ్ఞతా భావం పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించి, ప్రతి రంగంలో సేవలందిస్తున్న వారిని గౌరవించే సంస్కృతి పెరగాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెట్రోల్, డీజిల్ నిల్వలను ఆకస్మిక తనిఖీ చేసిన సిఐ



**చర్ల ఏప్రిల్ 26 వుదయం ప్రతినిధి**

చర్ల మండల పరిధిలో ఉన్న పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు ఎంత ఉన్నాయనే విషయంపై ఆరా తీసిన చర్ల సిఐ రాజువర్మ. పెట్రోల్, డీజిల్ కొరత రావడానికి, సప్లై నిలిపివేయడం వంటి కారణాలపై వివరాలు తెలుసుకున్నారు. సప్లై కంపెనీలు సుమారుగా లీటర్ కు 50 రూపాయలు నష్టం జరగడం వల్ల పెట్రోల్, డీజిల్, సరఫరా విషయంలో అన్నీ కంపెనీలు బంకులకు నియంత్రణ పెట్టడంతో రావలసిన సరఫరా రాకపోవడంతో పెట్రోల్ బంకులలో నో స్టాక్ బోర్డులు పెట్టడం జరుగుతుందని పెట్రోల్ బంకు యాజమాన్యం తెలిపారు.

ఈ కొరత ఎంత వరకు ఉంటుంది అనే విషయంపై అంచనా వేయలేకపోతున్నాం అని బంక్ యాజమాన్యం వివరించారు.

## గిరిజన గ్రామాలను సందర్శించిన ఎమ్మెల్యే జారె



**దమ్మపేట ఏప్రిల్ 26**
**(వుదయం ప్రతినిధి ):**

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం ఉదయం దమ్మపేట మండలంలోని మారుమూల కొండరెడ్ల గిరిజన ప్రాంతాలైన పూసుకుంట, కట్కూరు గ్రామాలలో పర్యటించారు ఈసందర్భంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులకు సూచనలు ఇచ్చారు అలాగే పాఠశాలలో జరుగుతున్న ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలించారు తదనంతరం గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారుఈ కార్యక్రమంలో

స్థానిక సర్పంచ్ యాట్ల రాజి రెడ్డి, ఉపసర్పంచ్ కోండ్రు బాబురావు, మడకం రాజేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ, ధ్వజస్తంభం శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట




**మాజీ ఎమ్మెల్యే తాటి**
**అశ్వరావుపేట ఏప్రిల్ 26**
**( వుదయం ప్రతినిధి ):**

అశ్వరావుపేట మండలం నారావారి గూడెం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ, మరియు గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బూర్గం పహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.. అనంతరం తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులతో అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు.

ఈ కార్యక్రమం లో మనుగొండ నాగమణి ( సర్పంచ్ ) ,సత్తెనపల్లి వెంకటేశ్వరావు ,లగడపాటి మల్లికార్జునరావు ,వేముల చిన్న కొర్రాజులు,వేముల సాయి ,తెల్లమేకల వెంకటేశ్వరావు , తదితరులు పాల్గొన్నారు..










## యాక్సిస్ బ్యాంక్ లాభం రూ.7,632 కోట్లు

ప్రైవేటు రంగ యాక్సిస్ బ్యాంక్, మార్చి త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.7,631.72 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024–25 ఇదే కాల లాభం కంటే ఇది 1.89% అధికం. పశ్చిమాసియా యుద్ధం వల్ల, రుణాలపై పడే ప్రభావం కోసం రూ.2,001 కోట్లు కేటాయించినట్లు బ్యాంక్ వెల్లడించింది. మొత్తం కేటాయింపులు రూ.1,359 కోట్ల నుంచి రూ.3,522 కోట్లకు చేరాయి. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికరలాభం రూ.7,117.50కోట్ల నుంచి రూ.7,071.31కోట్లకు తగ్గింది. నికర వడ్డీ ఆదాయం 5% పెరిగి రూ.14,457కోట్లకు చేరింది. రుణాల జారీ 19% పెరగడం ఇందుకు ఉపకరించింది.

# బిజినెస్

# దేశంలో తగ్గిన ముడిచమురు ఉత్పత్తి

పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్ 70 డాలర్లలోపు ఉన్న ముడిచమురు ధర, 100 డాలర్లను మించింది. దేశీయ చమురు అవసరాల్లో 89%, గ్యాస్ అవసరాల్లో 51% దిగుమతులే తీరుస్తుండగా, ఇప్పుడు ధర ఇంతగా పెరగడం మన ఆర్థిక వ్యవస్థకు భారంగా మారుతోంది. ఇందువల్ల డాలర్ బలోపేతం అవుతూ, రూపాయి బలహీన పడుతోంది. ఫలితంగా వస్తువుల ధరలు పెరగడమే కాక, వృద్ధిరేటు క్షీణిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో దేశీయంగా ఉత్పత్తి అవుతున్న చమురు, గ్యాస్ పరిమాణాలు తగ్గడం మరింత కలవరపెడుతోంది. వరుసగా 11వ ఆర్థిక సంవత్సరమైన 2025–26 లోనూ చమురు ఉత్పత్తి క్షీణించింది. సహజవాయువు ఉత్పత్తి వరుసగా రెండో ఏడాదీ తగ్గింది. పాత చమురు క్షేత్రాల్లో నిల్వలు తగ్గడం, కొత్త క్షేత్రాలను కనుగొనకపోవడం ఇందుకు ప్రధాన కారణాలు. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 2025–26లో ముడిచమురు ఉత్పత్తి 2.5% తగ్గి 28 మిలియన్ మెట్రిక్ టన్నులకు పరిమితమైంది. 2014–15 నుంచి ఇప్పటివరకు మొత్తం ఉత్పత్తిలో 22% క్షీణత నమోదైంది. దేశీయ గ్యాస్ ఉత్పత్తి 3.7% తగ్గి 34,776 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల (ఎంఎంఎస్‌సీఎం)కు పరిమితమైంది. 2011–12లో ఉత్పత్తి 47,555 ఎంఎంఎస్‌సీఎం కావడం గమనార్హం. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన కేజీ–డీ6 బ్లాక్, ఓఎన్‌జీసీ పాత క్షేత్రాల నుంచి ఆశించిన స్థాయిలో ఉత్పత్తి రాకపోవడం ఇందుకు నేపథ్యం.




ప్రభుత్వం చర్యలు చేపట్టినా.. చమురు క్షేత్రాల అన్వేషణకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. నిబంధనలను సరళతరం చేయడం, సులభంగా పర్యావరణ అనుమతులు ఇవ్వడం, జాతీయ భౌగోళిక డేటా రిపోజిటరీని ఏర్పాటు చేయడం వంటి సంస్కరణలు తెచ్చింది. అన్వేషణ సంస్థలకు భారీ వాటా దక్కేలా నిబంధనావళి రూపొందించింది. అయినా చమురు క్షేత్రాల అన్వేషణకు అధునాతన టెక్నాలజీ, మూలధనం కలిగిన విదేశీ చమురు కంపెనీలు ముందుకు రావడం లేదు. గత పదేళ్లలో జరిగిన చాలా లైసెన్సింగ్ రౌండ్లలో దేశీయ ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యమే సాగడం గమనార్హం. ఈ నేపథ్యంలో రష్యా నుంచి కొంచెం రాయితీపై లభిస్తున్న చమురు కొనుగోళ్లను కొనసాగించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వనరులపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

### ఇరాన్ యుద్ధం కొనసాగితే..

## భారతీయులపై ‘3ఎఫ్’ ప్రభావం



ప్రస్తుత ఇరాన్ యుద్ధం ప్రపంచానికి అతిపెద్ద చమురు షాక్ ఇస్తోందని.. 1970 నాటి సంక్షోభం కంటే ఇది పెద్దదని హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్యనిధి) మాజీ డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్ పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం ఇలాగే కొనసాగితే భారత్‌పై త్వరలోనే 3ఎఫ్ (ఆహారం (ఫుడ్), ఇంధనం (ఫ్యూయల్), ఎరువులు(ఫెర్టిలైజర్)) ప్రభావం ఉండొచ్చని వివరించారు. ఉద్రిక్తతలు త్వరగా చల్లబడితే ప్రతికూల ప్రభావం పరిమితంగా ఉండొచ్చనీ అన్నారు. ‘ఉద్రిక్తతలు ఎంతకాలం కొనసాగుతాయన్న దానిపై ఆధారపడి అంతర్జాతీయ వృద్ధి ఉంటుంది. యుద్ధం త్వరలో ఆగితే, అంతర్జాతీయ వృద్ధి 0.3 శాతమే తగ్గొచ్చు. అయితే బ్యారెల్ చమురు ధర 100 డాలర్ల దరిదాపుల్లో దీర్ఘకాలం కొనసాగితే, అంతర్జాతీయ వృద్ధి 3.4% బదులుగా 2.5 శాతానికి పరిమితం కావొచ్చ’ని అంచనా వేశారు. అమెరికా టారిఫ్‌లు తగ్గడమే అండ: ‘అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 10 శాతానికి తగ్గడం భారత్‌కు కొంత ఊరట కలిగించే అంశం. ఈ ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వృద్ధి 6.5 శాతంగా నమోదు కావొచ్చ’ని గోపీనాథ్ అన్నారు. ‘చమురు, ఎరువుల కోసం పశ్చిమాసియాపై భారత్ ఆధారపడి ఉంది. ఇరాన్ యుద్ధం కొనసాగితే, వీటి ధరలు పెరిగే సంగతి పక్కనపెడితే.. సరఫరాకే ఇబ్బంది రావొచ్చు. ఎక్కువ కాలం పాటు ఇంధన ధరలపై సబ్సిడీని కొనసాగించడం భారత ప్రభుత్వానికి కష్టం కావొచ్చు. ద్రవ్యలోటును దృష్టిలో ఉంచుకుని, పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచాల్సి రావచ్చు. ఎరువుల సరఫరా విషయానికొస్తే ఇప్పటికే ఉన్న దీర్ఘకాల కాంట్రాక్టులు కాపాడుతున్నాయి.

## ఏఐ విస్తరణకు 1000 మంది ఫ్రెషర్ల నియామకం




కృతిమ మేధ రాకతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు పోతాయంటూ ఈ మధ్య కాలంలో తరచూ వింటున్నాం. ఇందుకు తగ్గట్టుగానే మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్, గూగుల్ వంటి పలు టెక్ కంపెనీలు ఏఐలో పెట్టుబడులు పెడుతూ.. వేల సంఖ్యలో ఉద్యోగాల కోతలు చేపడుతున్నాయి. కానీ, వీటికి భిన్నంగా సేల్స్‌ఫోర్స్ కంపెనీ ఆలోచిస్తోంది. ఏఐ విస్తరణకు వెయ్యి మంది ఫ్రెషర్స్‌ని నియమించుకుంటామని ప్రకటన చేయడం గమనార్హం. ఇందుకు కొత్త గ్రాడ్యుయేట్లు, ఇంటర్న్‌లు అవసరమని సేల్స్‌ఫోర్స్ కంపెనీ సీఈఓ మార్క్ బేనియాఫ్ ఎక్స్ వేదికగా తెలిపారు. ‘సేల్స్‌ఫోర్స్‌లో ఏజెంట్‌ఫోర్స్, హెడ్‌లెస్ 360 వంటి ఏఐ ఆధారిత ప్రాజెక్టుల కోసం ఫ్రెషర్ల నియామకం చేపడుతున్నాం. ఏఐ నిర్మాణానికి, అభివృద్ధికి యువత అవసరం'' అని మార్క్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే కొత్త నియామకాలు 5.6 శాతం పెరిగాయని ఏఐ, క్రిప్టో కరెన్సీ జార్ డేవిడ్ శాక్స్ స్పందించారు. ఇది ఓ వ్యూహాత్మకమైన అడుగుగా అభివర్ణించారు. ‘ఏఐతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు పోవడం నిజమే కావొచ్చు. కానీ, యువత కొత్త టెక్నాలజీని త్వరగా అందిపుచ్చుకుంటోంది’ అని మార్క్ బదులిచ్చారు.

# రిఫైనరీ ఉత్పత్తి పెంచిన భారత్



ఇరాన్ యుద్ధ సెగలు ఇప్పట్లో ఆరేలా కనిపించడం లేదు. ఆ ప్రభావం మన వంట గదుల వరకూ వ్యాపిస్తోంది. ఖతార్ వంటి సంప్రదాయ దేశాల నుంచి వంట గ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరా తగ్గడంతో, మరికొన్ని మార్కెట్లలో కొనుగోలు చేస్తోంది. దేశీయ రిఫైనరీల్లో ఉత్పత్తి పెంచేందుకూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వినియోగదార్లు ప్రత్యామ్నాయాలకు మళ్లాలనీ సూచిస్తోంది. ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ)తో వస్తున్న నౌకలు పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకు పోవడం వల్ల, మనదేశానికి ఇబ్బంది ఎదురవుతోంది. ఫిబ్రవరిలో యుద్ధం మొదలయ్యాక మనదేశం రోజుకు 46,000 టన్నుల మేర గ్యాస్ ఉత్పత్తి పెంచింది. మే నెలలో నయారా ఎనర్జీ రిఫైనరీ పునః ప్రారంభమైతే కనుక అది 50,000 టన్నులకు చేరుతుంది. మే నెలకు రిఫైనరీలు 6,50,000 టన్నుల అదనపు సరఫరా పొందాయి. అంటే రోజుకు 21,000 టన్నుల మేర రానుంది. ఇందులో అమెరికా నుంచి వచ్చేదే ఎక్కువ అని విశ్వసనీయ వర్గాల సమాచారం. మొత్తం మీద రోజుకు 71,000 టన్నుల ఎల్‌పీజీ అందుబాటులో ఉన్నట్లు లెక్క. యుద్ధానికి ముందు మనదేశం రోజుకు లక్ష టన్నుల గ్యాస్ వినియోగించేది. ప్రస్తుత సరఫరా మొత్తం చూసినా ఆ స్థాయికి తక్కువగానే ఉంది. రెండు నెలలుగా ఆసియాలోని అన్ని దేశాలు చమురు, ఎల్‌పీజీ, సహజ వాయువు కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. ధరలనూ పెంచాల్సి వచ్చింది. ఎల్‌పీజీ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి చేర్చాలంటూ మన రిఫైనరీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాణిజ్య రంగానికి గ్యాస్ సరఫరాను గతంతో పోలిస్తే 70 శాతానికి పరిమితం చేసింది. బొగ్గు, కిరోసిన్ వాడకానికి అనువుగా కాలుష్య నిబంధనలనూ సడలించింది. ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకునే గడువును పెంచింది. గొట్టపు గ్యాస్‌కు మారాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ప్రస్తుతం 33.4 కోట్ల ఎల్‌పీజీ వినియోగదార్లుండగా, రోజుకు 10,000 చొప్పున గొట్టపు గ్యాస్ కనెక్షన్లు జత అవుతున్నాయి. సంక్షోభం మొదలయ్యాక 3 శాతం కనెక్షన్లు పెరిగాయి. మే నెలలోనూ దేశంలో ఎల్‌పీజీ సరఫరా కాస్త ఇబ్బందిగానే ఉండొచ్చని కెప్లర్ లీడ్ అనలిస్ట్ సుమిత్ రితోలియా పేర్కొన్నారు. అట్లాంటిక్ బేసిన్, పశ్చిమాసియాంతర దేశాల నుంచి భారత్ ఎక్కువ ధరకు గ్యాస్ కొనుగోలు చేసే అవకాశం ఉంది. అందువల్ల జూన్ నుంచి సరఫరా సాధారణ స్థాయికి చేరొచ్చు. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) ఇటీవల మే–జూన్ నెలలకు అమెరికా నుంచి స్పాట్ కార్గోలను కొనుగోలు చేశాయని తెలుస్తోంది. ఈ నెలలో అమెరికా నుంచి భారత్‌కు 4,71,000 టన్నుల ఎల్‌పీజీ రానుందని కెప్లర్ గణాంకాలు సూచిస్తున్నాయి. ఎల్‌పీజీ కొరత దేశ ఆర్థిక వ్యవస్థపైనా కనిపిస్తోంది. రెస్టారెంట్లలో తయారు చేసే పదార్థాల సంఖ్య తగ్గుతోంది. కార్మికుల జీవన వ్యయాలు పెరుగుతున్నాయి. కొంత మంది వలస కార్మికులు వంట చేసుకోలేక, సొంత ఊళ్లకు వెళ్లిపోతున్నారనే వార్తలొస్తున్నాయి. ఎల్‌పీజీ సిలిండరు దొరకదనే భయంతో, రెండో సిలిండర్ ఉన్నవారు ముందస్తుగా రీఫిల్ బుక్ చేయడమూ ప్రభావం చూపుతోంది.


# క్రీడలు

## మెరిసిన ‘లక్ష్య’ సాయికిరణ్



జాతీయ జూనియర్ ఫెడరేషన్ అండర్–20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం ‘లక్ష్య’ అథ్లెట్ సాయికిరణ్ సత్తా చాటాడు. కర్ణాటకలోని తుమకూరులో జరుగుతున్న ఈ పోటీల్లో సాయికిరణ్ షాట్‌పుట్‌లో స్వర్ణంతో మెరిశాడు. శనివారం అతడు గుండును 18.65 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. లాంగ్‌జంప్‌లో షానవాజ్ ఖాన్ అండర్–20 జాతీయ రికార్డును సృష్టించాడు. 8.23 మీటర్ల జంప్‌తో షానవాజ్ స్వర్ణాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ క్రమంలో మురళీ శ్రీశంకర్ (8.20 మీటర్లు, 2018లో) నెలకొల్పిన రికార్డును తిరగ రాశాడు. మహిళల 100 మీటర్ల పరుగులో నిపామ్ రాన్ జూనియర్ జాతీయ రికార్డును నెలకొల్పింది. ఆమె 11.53 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అభినయ (11.54 సె) పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. పురుషుల 400 మీటర్ల పరుగులో అష్ఫాక్ 46.05 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు.

## నాయకత్వం గురించి ఆలోచించను..: ఇషాన్ కిషన్



ఐపీఎల్ 2026 సీజన్‌లో సగం మ్యాచ్‌లు ముగిసిన తర్వాత సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్‌కు జట్టులోకి వచ్చాడు. వచ్చీ రావడంతోనే టాస్‌ను నెగ్గిన కమిన్స్ మ్యాచ్‌లోనూ విజయం సాధించాడు. గత ఏడు మ్యాచుల్లో జట్టును నడిపించిన ఇషాన్ కిషన్ మరోసారి కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచాడు. ఈ క్రమంలో అతడి వద్ద ‘కెప్టెన్సీ’పై వచ్చిన ప్రశ్నకు ఇషాన్ అద్భుతంగా సమాధానం ఇచ్చాడు. ‘ఈ పిచ్ బ్యాటింగ్‌కు చాలా బాగుంది. రాజస్థాన్‌ను 230 పరుగుల్లోపే కట్టడి చేయాలని ముందే భావించాం. మా బౌలర్లు అదే చేసి చూపించారు. మా కెప్టెన్ కమిన్స్ జట్టులోకి రావడం బాగుంది. ఏడు మ్యాచుల్లో నేను సారథిగా వ్యవహరించా. కమిన్స్ రాకతో అదనంగా మాకు బౌలింగ్ ఆప్షన్ వచ్చినట్లైంది. కమిన్స్ అద్భుతమైన కెప్టెన్. నేనెప్పుడైనా సరే నాయకత్వం కంటే నా బ్యాటింగ్, వికెట్ కీపింగ్ గురించే ఎక్కువగా ఆలోచిస్తా. రాజస్థాన్ రాయల్స్‌పై మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడటం సంతోషంగా ఉంది. ప్రతి బంతిని నిశితంగా గమనించి షాట్లు కొట్టేందుకు ప్రయత్నించా. ఆర్చర్‌ను ఎదుర్కోవడం చాలా కష్టం. అతడి పేస్‌తోపాటు బౌన్స్ కాస్త ఎక్కువగా ఉంటుంది. తొలి బంతికే సిక్స్ రావడం లక్కీగా భావిస్తా. ధైర్యంగా ఆడితే అదృష్టం కూడా కలిసొస్తుందని అంటారు. మా బౌలర్లు కూడా అద్భుతంగా కట్టడి చేశారు. 229 పరుగుల టార్గెట్‌ను ఛేదించవచ్చని భావించా. అభిషేక్, హెడ్ మా పనిని తేలిక చేస్తారు. వారిద్దరూ కనీసం నాలుగు ఓవర్లు ఉన్నాసరే రన్‌రేట్ కంట్రోల్‌లోకి వచ్చేస్తుంది. ఈ మ్యాచ్‌లో హెడ్ త్వరగానే ఔటైనప్పటికీ.. అభిషేక్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతడితో కలిసి మంచి భాగస్వామ్యం నిర్మించా. ఇప్పటికీ నా బ్యాట్ నుంచి గొప్ప ఇన్నింగ్స్ ఇంకా రాలేదనే చెబుతా. తప్పకుండా ఆ రోజు వస్తుంది'' అని ఇషాన్ కిషన్ తెలిపాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్ కేవలం 31 బంతుల్లోనే 74 పరుగులు చేశాడు. ‘వరుసగా నాలుగో విజయం సాధించడం ఆనందంగా ఉంది. గెలుపులో మన భాగస్వామ్యం ఉంటే ఆ అనుభూతి భిన్నమైంది. అవకాశాలు తీసుకున్నా.. కాస్త అదృష్టం కూడా కలిసొచ్చింది. ఈ పిచ్‌పై బ్యాటింగ్ చేయడం పెద్ద కష్టమేం కాదు. రాజస్థాన్ 15 పరుగులు వెనకబడిందని చెప్పను. ఎందుకంటే కనీసం 20 పరుగులు అదనంగానే చేశారు. ఆర్చర్, బర్గర్ వంటి పేసర్లను ఎదుర్కోవడం తేలికేం కాదు. ఎలాంటి బంతి వేస్తారో అర్థం చేసుకోవడం చాలా కష్టం. కొత్త బంతితో సవాల్ విసురుతారు. ఆత్మవిశ్వాసంతో ఈ ఛేజింగ్‌ను మొదలుపెట్టి.. పూర్తి చేశాం. మా తదుపరి మ్యాచ్ వాంఖడేలో జరగనుంది. అక్కడ ఆడటం నాకు చాలా ఇష్టం. మరోసారి మంచి స్కోరు చేసేందుకు ప్రయత్నిస్తా'' అని అభిషేక్ శర్మ వెల్లడించాడు. హెడ్ త్వరగా పెవిలియన్‌కు చేరినా.. అభిషేక్ మాత్రం 29 బంతుల్లో 57 పరుగులు చేశాడు.

## ఆ ఇద్దరికి ఒక్కో ఓవరే ఇవ్వడానికి కారణమదే: రియాన్ పరాగ్



సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ ఘోర ఓటమి చవిచూసింది. భారీ స్కోరు చేసినా సన్‌రైజర్స్‌ను అడ్డుకోవడంలో రాజస్థాన్ బౌలింగ్ యూనిట్ విఫలమైంది. అయితే, తమ జట్టు బౌలర్లను సరిగ్గా వినియోగించుకోలేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని రియాన్ పరాగ్‌పై విమర్శలు వచ్చాయి. రవీంద్ర జడేజా, రవి బిష్ణోయ్‌కు ఒక్కో ఓవర్ ఇవ్వడంపై మ్యాచ్ అనంతరం రియాన్ పరాగ్ కారణం ఏంటనేది వెల్లడించాడు. ‘నైపుణ్యంపరంగా సరిగ్గానే మా ప్రణాళికలను అమలు చేశాం. కానీ, కీలకమైన క్యాచ్‌లను వదిలేశాం. అదీనూ భారీ షాట్‌లు కొట్టే అభిషేక్ వంటి ప్లేయర్ ఇచ్చిన క్యాచ్‌ను వదిలిపెట్టడం నష్టం చేసింది. ఇలాంటి వారి నుంచి రెండో ఛాన్స్ వస్తుందని ఆశించలేం. మ్యాచ్‌ను మా నుంచి లాగేశారు. మేం ఫీల్డింగ్‌లో ఇంకాస్త మెరుగు కావాల్సిన అవసరం ఉంది. గేమ్‌లో ఇదంతా భాగమే అయినా.. ఇంప్రూవ్ చేసుకుంటాం. తర్వాత మ్యాచ్‌నాటికి సరిచేసుకుని బరిలోకి దిగుతాం. తొలుత మేం బ్యాటింగ్‌లో కనీసం మరో 15 పరుగులు చేయాల్సింది. ఆఖర్లో సన్‌రైజర్స్ బౌలర్లు చాలా బాగా బౌలింగ్ చేశారు. యార్కర్లను చక్కగా అమలు చేశారు. మా బౌలింగ్ సమయంలో బిష్ణోయ్, రవీంద్ర జడేజాను ఆలస్యంగా తీసుకురావడానికి కారణం అప్పటికి క్రీజ్‌లో ఇద్దరు ఎడమచేతివాటం బ్యాటర్లు ఉండటమే. అందుకే, నేను, ఫెర్రీరా తలో ఓవర్ వేశాం. వికెట్ దక్కితే పరిస్థితి భిన్నంగా ఉంటుందని భావించాం. క్లాసెన్ వచ్చినప్పుడు. జడ్డూ, బిష్ణోయ్‌ను రంగంలోకి దించాలని అనుకున్నా. కానీ, పిచ్ నుంచి స్పిన్నర్లకు సహకారం లభించలేదు. అందుకే, నాలుగు ఓవర్లను మాత్రమే స్పిన్ వేయించా. ఆర్చర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు.

## నాలుగో టీ20లో గెలిచిన అమ్మాయిలు

దక్షిణాఫ్రికాతో ఇప్పటికే టీ20 సిరీస్ కోల్పోయిన భారత అమ్మాయిల జట్టు ఎట్టకేలకు ఓ విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో 14 పరుగుల తేడాతో సఫారీలపై గెలిచింది. మొదట జెమీమా రోడ్రిగ్స్ (43; 29 బంతుల్లో 4×4, 2×6), దీప్తి శర్మ (36; 26 బంతుల్లో 5×4), రిచా (34; 18 బంతుల్లో 5×4, 1×6) మెరుపులతో భారత్ 5 వికెట్లకు 185 పరుగులు చేసింది. మార్క్స్ (2/28), రెనెకె (2/10) రాణించారు. కీలక సమయాల్లో దీప్తి (5/19) విజృంభించడంతో సఫారీ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులే చేసింది. సునే లుజ్ (40), తజ్మిన్ బ్రిట్స్ (30) రాణించారు. ఆఖరి టీ20 సోమవారం జరుగుతుంది.




## ఎంగిడికి తీవ్ర గాయం

పంజాబ్‌తో మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ ఢిల్లీ క్యాపిటల్స్ ఫాస్ట్‌బౌలర్ లుంగి ఎంగిడి (దక్షిణాఫ్రికా) తీవ్రంగా గాయపడ్డాడు. క్యాచ్ పట్టే ప్రయత్నంలో అతడు పడ్డ తీరు, ఆ తర్వాత కదలలేకపోయిన తీరు అందరినీ తీవ్ర ఆందోళనకు గురి చేసింది. అంబులెన్స్‌లో ఎంగిడిని ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. పంజాబ్ ఛేదనలో మూడో ఓవర్లో జరిగింది ఆ ఘటన. పంజాబ్ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య కొట్టిన బంతి గాల్లోకి లేవగా బంతి దిశను ఎంగిడి తప్పుగా అంచనా వేశాడు. వెనక్కి అడుగులేస్తూ బంతిని అందుకునే ప్రయత్నం చేశాడు. క్యాచ్ అందలేదు కానీ అతడు అదుపు తప్పి వెనక్కి పడ్డాడు. ఆ క్రమంలో తల మైదానానికి బలంగా తగలింది. మెడ కూడా ఒత్తిడికి గురైంది. తీవ్రమైన నొప్పితో విలవిల్లాడిన అతడు.. మళ్లీ లేవలేకపోయాడు. వెంటనే వైద్య సిబ్బంది స్ట్రెచర్‌తో మైదానంలోకి వచ్చారు. చాలా సేపు అతణ్ని కదపకుండా అలాగే ఉంచారు. ఎంగిడి వాళ్లతో మాట్లాడడం కనిపించింది. ఎంగిడిని స్ట్రెచర్‌తోనే అంబులెన్స్‌లోకి ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. ఎంగిడి గాయం కారణంగా పది నిమిషాలకు పైగా ఆట ఆగిపోయింది. ఎంగిడికి ఎలాంటి ప్రమాదం లేదని, అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని తర్వాత ఐపీఎల్ నిర్వాహకులు చెప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. శనివారం రాత్రే ఎంగిడిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.



